www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 సెప్టెంబర్ 2024

డిసిసి అధ్యక్షులుగా గాజుల భాస్కర్ నియామకం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : డిసిసి అధ్యక్షులుగా గాజుల భాస్కర్‌ను నియమిస్తూ ఆదివారం అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని సంవత్సరాలుగా పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన పిసిసి అధ్యక్షులు షర్మిల నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. గతంలో భాస్కర్ ఉమ్మడి కడప జిల్లా, ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. 2024 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ టికెట్ ఆశించిన ఆయనకు ఫలితం దక్కలేదు. ఆ కారణంగానే రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడుగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొని వస్తారని ఆశించిన అధిష్టానం భాస్కర్‌కు అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని చెప్పవచ్చు. జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన నాయకులు షర్మిల, కెసి వేణుగోపాల్, మాణిక్యం ఠాగూర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరి హారం.. హాసం!

గండికోట నిర్వాసితులతో పాలకులు పరిహాసమాడుతున్నారు. దశాబ్దాల తరబడి నిర్వాసితుల జీవితాలతో చదరంగం ఆడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఆసరా చేసుకుని టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి ఏకంగా పాదయాత్ర చేశారు. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు సార్లు పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంది. ప్రభుత్వం కర్నూలు జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్న నేపథ్యంలో గండికోట నిర్వాసిత కాలనీల్లోకి వెనుకజలాలు చేరుతుండడం ఆందోళన నెలకొంది. గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయంలో ఆసక్తి నెలకొంది.

- **రూ.454 కోట్ల చెల్లింపులకు నిరీక్షణ**
- **నిర్వాసిత గ్రామాల్లోకి వెనుకజలాలు**
- **వెంటాడుతున్న ముంపు భయం**
- **త్వరలో గండికోటలో పూర్తి స్థాయి నిల్వ**

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గండికోట నిర్వాసితుల గోడు ఎవరికీ పట్టడం లేదు. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టిఎంసిల నిల్వ సామర్థ్యం గండికోట సొంతం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన త్యాగధనులు నిర్వాసితులు. వారిని నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు దఫాలుగా నిండడం, మరోసారి శ్రీశైలానికి పెద్దఎత్తున వరద కొనసాగుతున్న నేపథ్యంలో గండికోటకు 10 వేల క్యూసెక్కుల నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికి 19.9 టిఎం సిల నిల్వతో జలకళను సంతరించుకుంది. ఐదు రోజుల వ్యవధిలో 26.85 టిఎంసిలతో పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకోనుంది. ఇప్పటికే నిర్వాసిత గ్రామాలైన పి.అనంతపురం, చామలూరు, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లోకి వెనుకజలాలు చేరుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

2018 ఆగస్టులో టిడిపి సర్కారు రూ.6.75 లక్షల చొప్పున పరిహారం చెల్లింపులు చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లుగా సుమారు 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్లు చెల్లింపులు ఆచరణ దిశగా అడుగులు పడక పోవడం ఆందోళన కలిగిస్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు గ్రామాల పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 16,800 పిడి ఎఫ్‌లకు రూ.10 లక్షల చొప్పున రూ.1346 కోట్లు పరిహారం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. ఫేజ్-1 కింద అప్పటి సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53 కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా జగన్ గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసితులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట నిర్వాసితులకు రూ.110 కోట్లతో 18 కాలనీలకు రూపకల్పన చేశారు. రూ.100 కోట్లతో 11 నిర్వాసిత కాలనీలను పూర్తి చేశారు. రూ.35 కోట్లు బిల్లుల్ని అప్‌లోడ్ చేశారు. మరో రూ.25 కోట్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది.18 నిర్వాసిత కాలనీల్లో ఎనిమిది కాలనీలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందిన కూటమి ఎమ్మెల్యేలపై గండికోట నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనల సందర్భంగా, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా పాదయాత్ర సాగించిన సి.భూపేష్‌రెడ్డిపై గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపులపై ఇచ్చిన హామీలను అమలు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎపిఎండిసి సంస్థ అభివృద్ధికి ఇండ్లను తొలగించిన 37 బిసి కుటుంబాలకు 12 సంవత్సరాలుగా స్థలాలు ఇవ్వలేదని, తక్షణం వీరికి ఇళ్ల స్థలాలు, ఇచ్చి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్త మంగంపేట, అయ్యప్పరెడ్డిపల్లి పునరావాస బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎండిసి పునరావాస బాధితులతో 2012 సంవత్సరంలో సంస్థ అభివృద్ధికి ఇండ్లను, భూములను ఇచ్చిన 37 బిసి సామజిక వర్గానికి చెందిన వారికి 12 సంవత్సరాల నుండి ఇండ్లు కట్టుకోవడానికి ఇంటి స్థలం కేటాయించలేదని పేర్కొన్నారు. వారు బాడుగ ఇండ్లలో ఉండుటకు బాడుగలు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. పెత్తందార్లకు మాత్రం ఇండ్ల స్థలాలు యాజమాన్యం కేటాయించిందన్నారు. ఏ దిక్కు లేరని 37 బిసి కులాల కుటుంబాలకు ఇంటి స్థలం ఇవ్వక పోవడం, పెత్తందార్లకు కేటాయించడం చూస్తుంటే వివక్ష చూపుతున్నారని మండి పడ్డారు. నూతన ప్రభుత్వంలోని అధికారులు, రాజకీయ నాయకులు, ఎపిఎండిసి ఎండి, కలెక్టరు, సబ్ కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ 37 బిసి కులానికి చెందిన కుటుంబాలకు జరిగిన అన్యాయాన్ని విచారణ జరపాలన్నారు. దీనికి కారణమైన అధికారులను సస్పెండ్ చేసి 37 కుటుంబాలకు చట్ట ప్రకారం రావలసిన అన్ని హక్కులు కల్పించి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బాడుగులు చెల్లించాలని, లేని పక్షంలో బాధితులను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న శ్రీనివాసులు

వరద బాధితులను ఆదుకోవడం గొప్ప విషయం : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయం అందజేయడం ప్రతి ఒక్కరూ ఎంతో గర్వించదగ్గ విషయమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గాలివీడు మండలంలోని శ్రీనాద్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు శ్రీనివాసులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ విజయవాడలో విపరీతంగా కురిసిన భారీ వర్షాల కారణంగా విజయవాడ ప్రాంతం అతలాకుతలమైందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తమ సామాజిక బాధ్యతగా శ్రీనివాసులు సాయం చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి అక్కడి బాధితులకు భారీగా ఆహార పొట్లాలు, పండ్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. మంత్రిని ఆదర్శంగా తీసుకొని తమ వంతు బాధ్యతగా వరద బాధితులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశామని శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకులు రూ.10 వేలు వితరణ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి చెంచర్ల ఆంజనేయులు రాయచోటి పట్టణంలోని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో రూ.10 వేలు నగదును అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.వరద బాధితులకు తమ వంతు సహాయంగా లక్కిరెడ్డిపల్లెకు చెందిన చెంచర్ల ఆంజనేయులు ఆర్థిక సహాయం అందజేయడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు.

అన్నదానం గొప్పది : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమమని టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని గాలివీడు రోడ్డు లక్ష్మీపురం వద్ద టిడిపి నాయకులు పెరికల రెడ్డన్న ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనియమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అన్నదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని లక్ష్మీపురం వాసులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

మోకాలి చికిత్స శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317ఇ, లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి, లయన్స్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ లేకుండా మోకాలి నొప్పి, వెన్నునొప్పికి చికిత్స అందించడం జరుగుతోందని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి లయన్స్ ఐ హాస్పిటల్‌లో రాజస్థాన్ డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంతన్ సహకారంతో ఉచిత మోకాలి చికిత్స శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరం ఆదివారం నుండి 12వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రతి రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు, సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు కొనసాగే ఈ ఉచిత మోకాలి చికిత్స శిబిరాన్ని ఆసక్తి కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో మోకాలికి ఆపరేషన్, చికిత్స లేకుండా జర్మనీ టెక్నిక్ ద్వారా బ్రేస్ తయారు చేయబడిందని, ప్రత్యేక చికిత్స ద్వారా మోకాలు నొప్పి, వెన్నెముక నొప్పి, సర్వైకల్ నొప్పికి చికిత్స కేవలం వంద రూపాయిలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ ఉచిత చికిత్స 5 రోజుల పాటు కొనసాగుతుందని ఇందులో డాక్టర్ ఇంద్రపాల్ కసూరియా బిఈఎంఎస్, థెరపిస్ట్ భూపేంద్ర చౌదరిని, ఎక్స్-రే, ఎంఆర్ఐ, మరియు రోగ నిర్ధారణకు సంబంధించి రికార్డులతో సంప్రదించవచ్చునన్నారు. ఇతర వివరాలకు లయన్ భాస్కర్ నాయుడు చైర్మన్ లయన్స్ ఐ హాస్పిటల్ : 94420272587 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

'ఉక్కు' రక్షణ రాస్తారోకోను జయప్రదం చేయండి

- కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోకపోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయివేటీకరణ విధానాన్ని నిరసిస్తూ 10వ తేదీ జిల్లాలో జరుగుతున్న రాస్తారోకో ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. రాస్తారోకో కరపత్రాలను ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ సముదాయంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ దగ్గర విడుదల చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికి అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని తెలిపారు. కేంద్ర మంత్రులు వచ్చి ప్రయివేటీకరణ చేయమని, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నిరుద్యోగం ఎక్కువుగా ఉన్న రాష్ట్రంలో పరిశ్రమలు మరిన్ని తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కానీ ఉన్న పరిశ్రమలు మూసి వేయడం మూర్ఖత్వం కాదా అని ప్రశ్నించారు. 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటికీ మూడు నెలలు కావస్తున్నా వాటి స్థితిగతులు గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వేల మంది రైతులు భూములు ఇచ్చారన్నారు. 32 మంది ప్రాణాల బలిదానం త్యాగమని గుర్తు చేశారు. ఇలాంటి స్టీల్ ప్లాంట్‌ను ఆదుకొని ప్రయివేటీకరణ ఆలోచన విరమింప చేసుకోవాలని 10వ తేదీ జరుగు రాస్తారోకో కార్యక్రమంలో కార్మిక కర్షకులు ఉద్యోగ, నిరుద్యోగులు, ప్రజలు, వ్యారస్తులు, ప్రజస్వామ్యవాదులు, విద్యార్థులు, మహిళలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కాదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి, మున్సిపల్ యూనియాన్ జిల్లా అధ్యక్షుడు బివి.రమణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, సిఐటియు నాయకులు డి.విజయమ్మ, మాధవయ్య పాల్గొన్నారు.

రాస్తారోకో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పశు సంపద అభివృద్ధికి కృషి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పాడి రైతులకు అందుబాటులో ఉండి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్ పెళ్లై పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పశు సమర్థ శాఖ అమలు చేస్తున్న పథకాలు, పాడి రైతుల పెంపకం, వ్యాధులు నివారణ, అధిక పాలు దిగుబడి రైతులు ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఎన్నున్నాయి?

జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలలో 30 మండలాల్లో మూడు డివిజన్‌లలో రాయచోటి మదనపల్లె, రాజంపేట ప్రాంతాలలో ఉప సంచాలకులు ఉన్నారు. మూడు డివిజన్లో 18 మంది సహాయ సంచాలకులు (ఎడిలు), పశు వైద్యాధి కారులు 72 మంది, గ్రామీణ పశు వైద్యాధికారులు 63 మంది ఉన్నారు. 226 రైతు సేవా కేంద్రాలలో పశువైద్య సహాయకులు, 116 మంది గోపాల మిత్రలు ఉన్నారు.

జిల్లాలో ఆవులు, గేదెలు వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,24,325 ఆవులు, గేదెలు ఉన్నాయి. ఇందులో 1,00,588 గేదెలు, 2,76,417 ఆవులు, గొర్రెలు, మేకలు మొత్తం 2,77,695 ఉన్నాయి. ఇందులో 13,24,325 గొర్రెలు, 3,53,370 ఉన్నాయి. 23,82,260 కోళ్లు, మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాలలో కోళ్ల పారాలు ఎక్కువగా ఉన్నాయి.

పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారా?

జిల్లాలో ప్రతి రైతు పశువులకు బీమా చేయించుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు మృతి చెందిన పశువులకు బీమా చెల్లించడం జరిగింది. ప్రస్తుతం బీమా పథకం కొనసాగిస్తున్నాం. దారిద్ర రేఖకు దిగువన ఉన్న రైతులు వారి పశువులు చెల్లించిన ప్రీమియం 80 శాతంలో రాయితీతో 20 శాతం రైతు కట్టాలి. ఒక రైతు ఐదు పశువులకు వరకు బీమా చేసుకోవచ్చును. 50 గొర్రెలు, మేకలకు బీమా చేసుకోవచ్చును. మూడు సంవత్సరాలలోపు మరణిస్తే సమీప పశు సమర్థ శాఖ వారు నష్టపరిహారం చెల్లిస్తారు.

జిల్లాలో శిథిలావస్థకు చేరిన పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఎన్ని?

జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 పశుసంవర్త శాఖ భవనాలు ఉన్నాయి. 13 భవనాలను వరకు శిథిల వ్యవస్థకు చేరాయి. వాటి వివరాలు ఉన్నతాధికారులకు ప్రతిపాదించడం జరిగింది. బడ్జెట్ మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

పశుగ్రాస అభివృద్ధికి ఎలా చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో 70 శాతం రాయితీతో 30 టన్నులు గడ్డి విత్తనాలు సరఫరాకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. దేనికి స్పందించి మొదట దశగా 175 టన్నులు గడ్డి విత్తనాలు వచ్చినాయి. సమీప రైతు సేవా కేంద్రంలోకి అందుబాటులో ఉన్నాయి. అవగాహన కలిగించడానికి తమ సిబ్బంది గ్రామాన్ని సందర్శిస్తారు. వారికి రైతులు సహకరించి ముందస్తు టీకాలు వేయించుకోవడం ద్వారా అంటువ్యాధులను నుంచి మీ పశువుల కాపాడుకోవచ్చు.

పాడే రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జిల్లా వ్యాప్తంగా ఉండే నిరుద్యోగులు కూడా పశువులను తీసుకొని పెంపుకోవాలి. పాడి రైతులు పశువులను ప్రాణాలను కాపాడుకోవాలి. ప్రతి ఒక్క రైతు పశువులకు బీమా చేయించుకోవాలి. ప్రస్తుతం గాలికుంట వ్యాధి నివారణకు 3,45,400 డోస్‌లో వచ్చాయి. 20-8-2024 తేదీ నుండి 18-9-24 తేదీ వరకు టీకాలు వేస్తున్నాము. తమ సిబ్బంది వచ్చినప్పుడు టీకాలు వేయించుకోవాలి. ప్రస్తుతం మన జిల్లాలో గాలికుంట వ్యాధులు ఇంత వరకు నమోదు కాలేదు. టీకాలు వేయడంలో రాష్ట్రంలో మన అన్నమయ్య జిల్లా రెండవ స్థానంలో ఉంది. పశు కిసాన్ క్రెడిట్ కార్డు కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ కార్డు ద్వారా బ్యాంకు వారు రూ.1.60 లక్షలు ఇస్తారు. పశువుల వ్యాధుల నివారణ, ఇతర ఖర్చులు ఉపయోగించుకోవచ్చు. 40 రోజులు లోపల పూర్తి చెల్లిస్తే ఎటువంటి వడ్డీ ఉండదు. ఆధార్, రేషన్, పట్టాదారు పాస్ పుస్తకం ధ్రువీకరణ పత్రములు జతచేసి సమీప కేంద్రాలను అందజేయాలి. రైతు యొక్క సివిల్ స్కోర్‌ను బట్టి బ్యాంకు వారు రుణాలు ఇస్తారు. ఇప్పటివరకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు 13,19 దరఖాస్తులు వచ్చినాయి. 9 వేల కార్డులను లక్ష్యంగా పెట్టుకున్నాం. కావున ప్రభుత్వ అందిస్తున్నటు వంటి సదుపాయాలను పాడి రైతుల సద్వినియం చేసుకోవాలి.

వృద్ధులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దృష్టి డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం బెంగుళూరు రోడ్డు స్థానిక జిఆర్‌టి హైస్కూల్‌లో సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిఆర్‌టి హైస్కూల్ వ్యవస్థాపక వ్యవస్థాపక అధ్యక్షులు గిరిరావు విగ్రహానికి పూలమాలల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన జయంతి, వర్ధంతి ఒకే రోజునే ఉండటం, పేదలకు విద్యను అందించడంలో ఆయన చేసిన అపూర్వ సేవలను స్మరించుకొన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరికి విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి విలువలతో కూడిన విద్యను అందించి ఎంతోమందిని ప్రయోజకులను చేసిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావుల సలహా మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకొని ఉచిత కంటి పరీక్షలు శిబిరాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ ఇమాన్యుయల్, ఆప్తమాలజిస్ట్ రాజశేఖర్ సుమారు వంద మంది సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో కంటిలో శుక్లం ఉన్న వారికీ ఆపరేషన్లకు, చూపు మందగించిన వారికీ కంటి అద్దాలు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శుల ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వరదల ప్రభావాన్నీ పరిగణలోకి తీసుకొని ఈ శిబిరం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సుమారు వంద మంది వరకు సీనియర్ సీనియర్ సిటిజన్స్ కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. అక్టోబర్ నెల రెండవ ఆదివారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతోపాటు సీనియర్లను సన్మానించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ముని రత్నమయ్య, కార్యదర్శి వి.యం. నాగరాజు, జగన్ మోహన్, శకుంతలమ్మ, ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు, నవల రచయిత, కవి టిఎస్ఎ కృష్ణమూర్తి, జిల్లా మహిళా కార్య నిర్వాహక సభ్యురాలు ధనలక్ష్మి, సరస్వతమ్మ, హేమ, రాదాబాయ్, రామచంద్రయ్య,విశ్రాంత ప్రిన్సిపల్ వై.కె.మునిరత్నం, ఎన్.వి.నాయుడు, గుండాల రామచంద్రతోపాటు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి : జెవివి

ప్రజాశక్తి-రాయచోటి

రాజ్యాంగ స్ఫూర్తితో శాస్త్రీయ దృక్పథ ప్రచారాన్ని నిర్వహిందామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 ఎహెచ్ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. సైన్స్ అనేది లేబరేటరీలో పుట్టేది కాదని సమాజంలోనే పుట్టిందని తెలిపారు. మానవుడి ప్రథమ ఆవిష్కరణ రాతి పనిముట్లని తెలిపారు. అన్నమయ్య జిల్లా కమిటీ అధ్యక్షులు ప్రభు చరణ్ మాట్లాడుతూ ప్రజలలో మూఢ నమ్మకాలు ప్రభలంగా ఉన్నాయని, వాటిని తొలగించడానికి జన విజ్ఞాన వేదిక తీవ్రంగా కృషి చేస్తోందని తెలియజేశారు. వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరంతరం ప్రజలను చైతన్య పరుస్తూ, శాస్త్రీయ అవగాహన పెంపొందిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు హరింద్రనాథ శర్మ మాట్లాడుతూ ప్రకృతికి నష్టం జరిగే పదార్థాల వాడకం పెరిగిందని, ఇది మంచిది కాదని తెలిపారు. శిలాజ ఇంధనాల వాడకాన్ని వీలైనంత తగ్గించాలని కోరారు. మానవతా రాష్ట్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మానవాళికి యుద్ధాలు అవసరం లేదని శాంతి కావాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం కోసం కొంతైనా పనిచేయాలని తెలియజేశారు. డాక్టర్ రెడ్డన్న మాట్లాడుతూ కాలేజీ విద్యార్థుల కు శాస్త్రీయ ఆలోచన దృక్పథం పైన తరగతులు నిర్వహించాలని కోరారు. చెకుముకి పత్రికకు జీవితకాల చందా ఇస్తానని చెప్పారు. మాజీ సైనికో ఉద్యోగి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం కలిగి ఉండాలని, మన కోసమే కాకుండా ఇతరుల కోసం కూడా జీవించాలని తెలియజేశారు. మానవసేవయే మాధవసేవ అని తెలిపారు. అందరూ క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి పుట్టుకే పోరాటంతో మొదలైందని తెలిపారు. వ్యక్తిగత జీవితం కొంతైనా త్యాగం చేసేవారు దేశానికి అవసరమన్నారు. సమాజ క్రమశిక్షణ నేర్పే బాధ్యతను జెవివి తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 25వ తేదీన అన్ని పాఠశాలలో చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూఢనమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం తీసుకురావాలని జిల్లా కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌రెడ్డి, హరినాథ్ రెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర్లు ,జగదీశ్వర్ రెడ్డి, చక్రపాణి, శంకరయ్య, డైట్ అధ్యాపకుల అసదుల్లా బాషా, చక్రపాణి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, ప్రతాపరెడ్డి, జయచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక నిర్వహించుకున్నారు. 2006-07 సంవత్సరంలో ఈ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు తమ అపూర్వ కలయికతో విద్యార్థి దశలో వారు చేసిన పనులు నెమరు వేసుకున్నారు. వారి అల్లరి చేష్టలు, చిలిపిచేస్తులు స్నేహితులతో పంచుకొని గురువులతో కలిసి మెలిసి పాఠశాలలో ఉన్న తీరును నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలకు గుర్తింపుగా విద్యార్థులు అంతా కలిసి కుర్చీలను వితరణ గామించినట్లు తెలిపారు. అనంతరం తమకు విద్య నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, సుమతమ్మ, ఉపాధ్యాయులు వై.వి.రమణ, రఘునాథ, సయ్యద్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

వరద సహాయక చర్యల్లో కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విజయవాడ వరద సహయక చర్యల్లో బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్, ఆర్.ఐ.శ్రీనివాసులుచ ఇంజనీర్ సందీప్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.ఆర్.మనోహర్ మాట్లాడుతూ గత వారం రోజుల నుండి ఇక్కడే ఉండి సహాయక చర్యల్లో పాల్గొంటున్నామని మాకు కేటాయించిన శ్రీనగర్, ప్రశాంత్ నగర్ కేటాయించడంతో సహాయక చర్యలతోపాటు పారిశుధ్య పనులు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. వారం రోజుల నుంచి అయిదు అడుగులు వరకు ఉన్న నీటి నిలువను మూడు అడుగులు దాకా శుభ్రపరచామని ఇంకా రెండు అడుగులు నీటిని శుభ్రపరిచి ప్రజలకు గృహాలు వినియోగంలోకి అందజేసి తర్వాత బి.కొత్తకోటకి విధుల్లోకి వస్తామని కమిషనర్ తెలిపారు.

11న మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జడ్‌పి హైస్కూల్లో 11 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు తెలిపారు. ఎస్‌జిఎఫ్‌ఐ అండర్-14, అండర్-17 విభాగాలలో బాలురు, బాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్, చెస్ మొదలగు ఏడు అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చక్కటి అవకాశాన్ని మండల పరిధిలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల పీడీ, పిఇటిలు అర్హత గల క్రీడాకారుల జాబితా, మధ్యాహ్నం భోజన అటెండెన్స్ తీసుకొని రావాలని సూచించారు.

ఎస్‌సి కార్పొరేషన్ యూనిట్లను పెంచాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామం 13 గ్రామాలకు చెందిన ఎస్‌సి లబ్ధిదారులకు యూనిట్లు పెంచాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ పేర్కొన్నారు. మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉన్నాయని, ఎస్‌సిలు ఎక్కువ ఉన్నారని అన్నారు. బ్యాంకు మేనేజర్లు ముందుగానే డిపాజిట్ కడతేనే లోన్లు ఇస్తున్నారని, పేదలైన దళితులు డిపాజిట్లు చెల్లించే ఆర్థిక స్తోమత లేదని అన్నారు. ప్రభుత్వం అర్హులైనలబ్ధిదారులకు గెదేలు, గొర్రెలు, కిరాణా షాపులకు యూనిట్లు మంజూరు చేయాలని కోరారు.

'వెలిగల్లు'లో నిమజ్జనం నిషేధం

ప్రజాశక్తి-గాలివీడు

వెలుగుల ప్రాజెక్టులో వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని నిషేదించినట్లు వెలిగల్లు ప్రాజెక్టు డిఇ శిరీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి రాయచోటి,గాలివీడు తాగునీటిని పంపిణీ చేస్తున్నామని కలుషితం వలన ప్రమాదం జరుగుతుందనే ఉద్దేశంతో విగ్రహాల నిమజ్జనం నిషేధించామని, ప్రజలు గమనించాలని కోరారు. వినాయక విగ్రహాలను అరవీడు గ్రామంలోని కుశావతి ప్రాజె క్టులో నిమజ్జనం చేయాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. గ్రామ సమీపంలో చెరువు, కుంటలలో నీరు ఉంటే అక్కడే నిమజ్జనం చేయాలని తెలిపారు.

సమాజ సేవలో పాత్రికేయుల సహకారం ఎనలేనిది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజ సేవలోనూ, వాసవి క్లబ్ నిర్వహిస్తున్న సేవలను సమాజానికి చేరవేయడంతో పాటు గుర్తింపు రావడానికి పాత్రికేయుల సహకారం ఎన లేనిదని వాసవి క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సెంట్రల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పాత్రికేయులకు సన్మానం చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు అక్కిశెట్టి శ్రీనాథ్, కార్యదర్శి పోనగంటి అమర్‌నాథ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కె ఎస్ కృష్ణమూర్తి, క్యాబినెట్ సెక్రటరీ పులిరాజ్ ఆనంద్, కోశాధికారి రెడ్డి లక్ష్మి దీపక్, అనిల్, కృష్ణరావు, నరేంద్ర కుమార్, లక్ష్మీపతి, ప్రభాకర్‌లు హాజరయ్యారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కోన పంచాయితీ కోనలో జడ్‌పి హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న మొడెం చెంగల్‌రాయుడు తిరుపతి పట్టణానికి చెందిన వే ఫౌండేషన్ వారు ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. చెంగల్‌రాయుడు ఏ పాఠశాలలో విధులు నిర్వహించినా ఆ పాఠశాలను అభివృద్ధిలో ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు.ఈ సందర్భంగా ప్రధానఉపాధ్యాయులు మాట్లాడుతూ తనకు పురస్కా రాలు, పతకాలు ముఖ్యం కాదని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల క్రమశిక్షణ ముఖ్య మని అన్నారు. కార్యక్రమంలో తుడా సెక్రెటరీ వెంకట్ నారాయణ, కౌన్సిలర్ డాక్ట ర్ వరలక్ష్మి, నవీన్ కుమార్‌రెడ్డి, ఆర్‌జెయుపి గౌరవాధ్యక్షులు గోపాల్, డాక్టర్ రెడ్డప్ప పాల్గొన్నారు.

ఆలయానికి వెండి పళ్లెం వితరణ

ప్రజాశక్తి-నందలూరు

ఆలయ అధ్యక్షుడికి వెండి పళ్లెం అందజేస్తున్న రమేష్‌బాబు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయానికి రాజంపేటకు చెందిన రమేష్‌బాబు తన భార్య సుప్రజ జ్ఞాపకార్థం వీరి కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయానికి 650 గ్రాముల వెండి పళ్లెం ఆలయ నిర్వహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎంబలూరు నరసింహశెట్టి, ఆలయ మాజీ అధ్యక్షులు గెలివి మల్లికార్జునశెట్టి, మేడా వెంకటకుమార్,నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

రాయచోటి : వినాయకుడి మండపం వద్ద ప్రజలతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని మాసాపేట మూడవ వీధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు. మాసాపేట గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రివర్యులు పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు. **కలకడ:**వినాయక చవితి వేడుకలను మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.మండల కేంద్రమైన కలకడ, గోపాలపురం, అగ్రహారం ,ఎర్రకోటపల్లి, పాపిరెడ్డిగారిపల్లి, గంగాపురం, ఎర్రయ్య గారిపల్లి, బాటవారిపల్లి, తదితర గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా వేద పండి తుల, వేదమంత్రాల మధ్య విగ్రహాలను ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలతో మండ పాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. **రైల్వేకోడూరు :** శ్రీ వరసిద్ధి వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి పాల్గొని గణేష్ విగ్రహాలను సందర్శించారు. మండలంలోని పోలోపల్లి, కెవిఆర్‌పురం, కోడూరుమండలం, బుడుగుంటపల్లి,కోడూరు పట్టణంలోని అమ్మవారి శాల, బలిజవీధి, ఆంజనేయస్వామి గుడి, చికెన్ సెంటర్, పోలీసుస్టేషన్ వెనుకభాగం, రంగ నాయ కులపేట, వైకోట క్రాస్,అనంతరాజుపేట, ఓబులవారిపల్లి మండలం గొల్లపల్లి,పలు గ్రామాలు సందర్శించారు. గ్రామ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు వారిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొప్పరపు అరవింద్ పలు గ్రామ ప్రజలు, అభిమానులు, ఎన్‌డిఎ కూటమి నాయకులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలో వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వెంకోజీగారిపల్లిలో, నిమ్మనపల్లిలో యువకులు, పెద్దలు, మహిళలు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.నిమ్మనపల్లెలో వినాయక విగ్రహ ఏర్పాటుకు 25 వేల రూపాయలను ఇచ్చిన జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు ఈతకట్ట చంద్రశేఖర్ ను నిర్వాహకులు ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు. స్థానిక పోలీసులు మండల వ్యాప్తంగా వినాయక మండపాల వద్ద గస్తీ లు నిర్వహిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షించారు. **వీరబల్లి:** గణపతి నవరాత్రులను పురస్కరించుకుని వీరబల్లి మండలంలో చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో వాడ వాడల ఏర్పాటుచేసిన మండపాల్లో వివిధ ప్రత్యేక ఆకృతుల్లో ఉన్న గణనాథుడి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన మండపాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని పోకనాటి వీధి,శ్రీరామస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు నిత్య పూజలు అందుకుంటున్నాడు.వినాయకుడి అద్భుత రీతిలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఏడు రోజులుపాటు వినాయక విగ్రహాన్ని ఉంచడడంతోపాటు ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. **రామాపురం:** మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో శనివారం నుంచి వినాయక చవితి పండుగ సందర్భంగా పల్లెల్లో విగ్రహాలను భారీగా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మహిళలు ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం ప్రసాదాలు, మధ్యాహ్నం భజనలు, రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. **కలికిరి:** వాడవాడలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కలికిరి మండలంలో అని గ్రామాలలో ప్రజలు వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మతాలకతీతంగా పిల్లలు, పెద్దలు ఉత్సాహం గా పొద్దున్నే వినాయకుని ప్రతిష్ఠించి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అన్న ప్రసాదాలు పంచిపెట్టారు. మత సామరస్యానికి మత సామరస్యానికి ప్రతీకాగా హిందూ, ముస్లిం సోదరులు కలసి చవితి వేడుకలు వైభవంగా చేసుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** వినాయక చవితి వేడుకల్లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. దేవళంవీధి, కృష్ణానగర్, నీరుగట్టువారిపల్లె, ప్రశాంత్‌నగర్, ఆర్య వైశ్య హాస్టల్, రామాలయం వీధి, సొసైటీ కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను శని, ఆదివారాల్లో దర్శించు కున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆయా ప్రాంత ప్రజలుపాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** వినాయక చవితి సందర్భంగా ఆదివారం టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం రాజంపేట పట్టణ పరిధిలోని అమ్మవారిశాల దగ్గర శ్రీ రాఘవేంద్ర వైశ్యా యూత్ ఏర్పాటుచేసిన వినాయకుని మండపాన్ని సందర్శించి స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతినగర్ యూత్ ఏర్పాటుచేసిన వినాయకుడి మండపాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి శాల పండితులు, శ్రీ రాఘవేంద్ర వైశ్య యూత్, శాంతినగర్ యూత్ సుగవాసి బాలసుబ్రమణ్యంను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గీతాంజలి రమణ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్, వెంకటేశ్వర నాయుడు, సంజీవ నాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కలకడ : వినాయక మండపం వద్ద సందడి చేస్తున్న యువకులు

టమోటా మార్కెట్‌లో రైతుల నిరసన

టమోటా మండి ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలోని టమోటా మార్కెట్లో రైతులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక గుర్రంకొండ రోడ్డులో ఉన్న టమోటా మార్కెట్‌లో మండలంలోని రైతులే కాకుండా ఇతర మండలాలకు చెందిన రైతులకు కూడా టమోటాలను మార్కెట తరలించి విక్రయిస్తారని రైతులు తెలిపారు. రైతులకు టమోటా మండి యజమానులు కమీషన్ పట్టుకుని డబ్బులు చెల్లిస్తారని, రైతులకు ఇచ్చే కమీషన్ ఎక్కువ తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు చొరవ తీసుకుని రైతుల నిరసనను విరమించాలని కోరారు. మండి యజమానులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలపడంతో నిరసన నిలుపుదల చేసి రైతులు వెనుతిరిగినట్లు స్థానిక ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ మండల కార్యవర్గ కమిటీ ఎన్నిక

- మండల అధ్యక్షులుగా బొమ్మనపల్లి లక్ష్మణ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంబేద్కర్ మండల కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ మండల అధ్యక్షులు బొమ్మనపల్లి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, చట్టాలు మారినా, కాలం మారినా అణగారిన వర్గాలకు చెందిన ప్రజల సమస్యలు మాత్రం మారలేదని అన్నారు. తమ సమస్యలపై పోరాటానికై బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలందరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో కుల, మత వర్గాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన పెద్దలు కలసి నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజంలో నేటికీ అగ్రవర్ణాలకు చెందిన వారే అభివృద్ధి చెందుతున్నారని, బడుగు బలహీన అణగారిన వర్గాలకు చెందిన ప్రజలు అట్టడుగునే ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వీరి అభివృద్ధిని ఆకాంక్షించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి ఆదుకోవాలన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని జి.గంగులప్ప కమిటీ సభ్యులకు పంపిణీ చేశారు.

అంబేద్కర్ జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నూతనంగా ఏర్పడిన అంబేద్కర్ మండల కమిటీలో అధ్యక్షులుగా బొమ్మనపల్లి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు జి.సహదేవ, ఉపాధ్యక్షులు వై.ఎర్రయ్య, వి.చలపతి, కన్వీనర్ ముబారక్, ట్రెజరర్ జి.గంగులప్ప, ఆర్గనైజర్స్ గా కె.అంజప్ప, జి.గోపిలు నియమితులయ్యారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన అంబేద్కర్ మండల కమిటీ ప్రతి సమస్యపై పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీరనాల మాణిక్యం, నవీన్, సుధాకర్, బొట్టు రమణ, జయన్న పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వల్లూరు పల్లి గ్రామంలో ఆదివారం తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందేలా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామాల్లో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మారు మూల గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి క్యాంపులు పేద ప్రజలకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ, ఆర్ సుధాకర్ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడులో కంటి వైద్య శిబిరం..

గాలివీడు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరాన్ని చిన్నమండెం మానవతా చైర్మన్ మండిపల్లి జయశంకర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి సిబ్బందిచే 200 మందికి చికిత్స చేశారని తెలిపారు. 41 ఒక మందికి శస్త్రచికిత్స అవసరమని కు గుర్తించారని తెలిపారు. వైద్య శిబిరానికి వారికి అల్పాహారం వసతి కల్పించినందుకు మండల మానవత సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు సుబ్బారెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, శంకర, వెంకటరమణారెడ్డి, చంద్రారెడ్డి , నరసిం హులు, దామోదర్, సాయి రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు

'అభిలాష' కృషికి ప్రోత్సాహం అవసరం

ప్రజాశక్తి-పీలేరు

అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషికి ప్రజల నుంచి ప్రోత్సాహం, సహకారం చాలా అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యారంగంతో పాటు వేర్వేరు రంగాల్లో సేవలందిస్తున్న గురువులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య బంగారు నంది, ఎక్సలెన్సీ, ఉత్తమ గురువుల పురస్కారాలతో సత్కరించుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి. ఉమ, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పేద ప్రజలకు అండగా ఉంటూ తన నిస్వార్థ సేవలు అందిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవాతత్పరులకు సమాజం తగిన తోడ్పాటు అందివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. స్థానికంగా ఖాదర్‌బాషా షేక్, డాక్టర్ యోగీష్ బాబు తుంగ, కె. విజితలు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మకు అండగా నిలిచి తోడ్పాటు అందివ్వడం ప్రశంసనీయమని అన్నారు.

హాస్టల్లో రికార్డులను పరిశీలిస్తున్న ప్రేమ సాగర్

ఎస్‌సి హాస్టల్లో ఎఎస్‌డబ్ల్యూ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని అప్పన్న కుంటలో ఉన్న ఎస్‌సి హాస్టల్‌ను రాజంపేట సోషల్ వెల్ఫేర్ అధికారి ప్రేమసాగర్ ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులలో భోజనం నాణ్యత వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మెనూ ప్రకారం భోజనం అందిస్తు న్నారని విద్యార్థులు చెప్పారు. గతంలో ఈ హాస్టల్లో ఎస్‌టి గురుకుల పాఠశాల ఉండడంతో వారి నీటి ట్యాంకులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు తీసుకొని పోయారని తెలిపారు. మా వార్డెన్ రెడ్డయ్య సొంత నిధులతో బోరుకు మరమ్మతులు చేయించి హాస్టల్లో ట్యూబ్ లైట్లు , ఫ్యాన్లు ఏర్పాటు చేయించారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, దుప్పట్లు, సామగ్రిని అందజే శారని అన్నారు. వార్డెన్ స్థానికంగానే నివాసం ఉండడంతో విద్యార్థులకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటున్నారని చెప్పడంతో ఎఎస్‌డబ్ల్యూ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకునే బాధ్యత మీపై ఉన్నదని ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

తహశీల్దార్ దైవాదీనం

సుండుపల్లె : మండలంలో ఇసుక, మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ దైవాదీనం తెలిపారు. ప్రభుత్వం ఇసుక, మట్టిని ప్రజలకు అందివ్వడానికి అన్ని ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని ఇసుక, మట్టిని పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టామని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు.

కుక్కల దాడిలో 12 పొట్టేళ్లు మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని హత్యరాల గ్రామంలోని వినాయకనగర్‌లో రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో దొడ్డిలోని మందలోకి కుక్కలు దూరి దాడి చేయడంతో 8 గొర్రెలు, 4 పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. హను మంతు ఈశ్వరమ్మ అనే దళిత మహిళ గొర్రెల పెంపకమే జీవనాధారంగా చేసు కుని కాలం వెల్లదీస్తూ ఉండేది. అనుకోని విధంగా ఒక్కసారిగా 12 జీవాలు మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఆ మహిళ జీవనోపాధి కోల్పోయానని రోదిస్తూ ఉంది. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని కోరారు.

రామాపురంలో జింక..

ప్రజాశక్తి-రామాపురం : కుక్కల దాడిలో జింక మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి కిందికి రావడంతో కుక్కలు వెంబడించి రామపురం మండల కేంద్రానికి సమీపంలో సరస్వతి పల్లె క్రాస్ రోడ్డు సమీపంలో కుక్కల దాడి చేయడంతో జింక మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు జింకను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం జరిపించిన అనంతరం అడివి ప్రాంతంలోకి తీసుకెళ్లి ఖననం చేసినట్లు ఇన్‌ఛార్జి సెక్షన్ ఆఫీసర్ భరణికుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో మృతి చెందిన జింక

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రెడ్డిమోహన(ఫైల్ ఫొటో)

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నిమ్మనపల్లె మండలం వెంగంవారి పల్లె పంచాయతీ కొత్త కొండసానివారిపల్లెకు చెందిన ఆర్.రెడ్డిమోహన (56) భార్య సుశీలమ్మతో కలసి వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె త్రివేణి, కుమారుడు సుదర్శన్ ఉన్నారు. కుమారుడు సుదర్శన్‌కు కలకడ మండలం బొంతావా రిపల్లెకు చెందిన శ్రీనాథ్, సుమతి దంపతులకు చెందిన కుమార్తె భానుమతిని ఏడాది క్రితం ఇచ్చి వివాహం చేశారన్నారు. కొంతకాలం వీరి దాంపత్య జీవితం సజావుగా సాగిందన్నారు. అనంతరం సుదర్శన్ దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి భార్య కాపురానికి రావడం లేదని అన్నారు. శనివారం మృతుడి వియ్యంకుడు శ్రీనాథ్ తన ఇద్దరు భార్యలు సుమతి, రమాదేవిలతో కలిసి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు కొత్తకొండ సానివారిపల్లెలోని రెడ్డిమో హన ఇంటికి వచ్చారని అన్నారు. రెడ్డి మోహన తన పొలం వద్దకు వెళ్లారన్నారని, కొంత సమయం తరువాత ఉదయం 9.30 గంటల సమయంలో పొలం వద్ద రెడ్డి మోహన చెట్టుకు వేలాడుతున్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని అన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా చేరుకొని రెడ్డి మోహనను క్రిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న రామ సముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తన తండ్రి మృతిపై అనుమానాలను వ్యక్తం చేస్తూ కుమారుడు సుద ర్శన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లపై కత్తులతో దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలంలోని అంగళ్లులో ఇద్దరు ప్రయివేట్ డ్రైవర్ల పై పెద్దపల్లి శివారెడ్డి పేరు చెప్పి 20 మంది రెండు కార్లలో వచ్చి శనివారం రాత్రి కత్తులతో దాడి చేశారు. విచక్షణా రహితంగా పొడవడంతో తెట్టు గ్రామం, మండెంవారిపల్లెకు చెందిన నిరంజన్‌రెడ్డి, సిటిఎంకు చెందిన ప్రసాద్ ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. కేసు దర్యాప్తులో ఉందని ముదివేడు పోలీసులు తెలిపారు.

బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. రామసముద్రం మండల కేంద్రానికి చెందిన మంజునాథ్ 450 కిలోల రేషన్ బియ్యం 20 బస్తాలు రేషన్ బియ్యాన్ని ఆటోలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకుని వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.